వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

వడ్డీతోపాటు తిరిగి చెల్లిస్తాం: ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఫిబ్రవరి 24: 'రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. పాలకుర్తి నియోజకవర్గంలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై పెడుతున్న కేసులుపై వడ్డీతోపాటు తిరిగి చెల్లిస్తాం' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులపై మాట్లాడారు. ఇప్పటికిప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే ఎన్ని సీట్లు వస్తాయనే విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకులు తప్పుడు కేసులు పెట్టి పార్టీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో రైతులను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారని, కరోనా కష్ట కాలాన్ని లెక్క చేయక రైతుభరోసా అన్నదాతల ఖాతాలో వేసిన ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారని గుర్తుచేశారు. రోమ్ నగరం తగలబడుతుంటే రాజు ఫిడేలు వాయిస్తూ కూర్చున్న చందాన పాలకుర్తిలో పాలన సాగుతున్నదని విమర్శించారు. పాలకుర్తిలో ఎండిన పంటలు, రైతుల ఆవేదన చూస్తుంటే ఎంతో బాధేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై తహసీల్దార్, ఎస్సైని నిలదీస్తే వారిపై కేసులు పెట్టిస్తారా అని ప్రశ్నించారు. ఏ సమయంలోనైనా రేవంత్ సర్కారు కూలవచ్చని జోస్యం చెప్పారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నేతలు

- నేడు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో చేరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగలనున్నది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితోపాటు సుమారు 500 మంది నాయకులు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు నేతృత్వంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరనున్నారు. తెలంగాణ భవన్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వీరికి కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నారు.



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

మహబూబాబాద్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పించి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీలు సత్యవతి, తక్కళ్లపల్లి, మాజీ ఎంపీ కవిత తదితరులు

కాంగ్రెస్‌ది పీపీపీ పాలన!

- సీఎం రేవంత్‌కు కేసీఆర్ ఫోబియా
- రాష్ట్ర ప్రభుత్వానికి 10% సర్కారు అని పేరు
- పాలిటిక్స్ తప్ప పరిపాలనపై దృష్టిలేదు
- ముఖ్యమంత్రి ఎస్ఎల్బీసీకి వెళ్లకుండా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికా?
- పీఆర్ స్టంట్లమీదే సోయి.. పరిపాలనపై లేదు
- ప్రధాని నరేంద్రమోదీ కాళ్లు పట్టుకొని అయినా.. మిర్చికి 25 వేల ధర కల్పించాలి
- ప్రజలకు అండగా ఉండేది గులాబీ జెండానే
- మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మహబూబాబాద్ జిల్లాలోని రామానుజపురంలో 'కేసీఆర్ ఇంటర్నెట్-జిరాక్స్' సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మహబూబాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం పీపీపీ మోడ్‌లో పనిచేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. పీపీపీ అంటే.. ఫోబియా, పాలిటిక్స్, పర్సెంటేజ్ అని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేసీఆర్ ఫోబియా పట్టుకున్నదని, మైక్ పట్టగానే కేసీఆర్‌ను తిట్టడం మించి ఇంకో ఆలోచన రావడంలేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 10 పర్సంటేజీ సర్కార్ అని పిలుస్తున్నారని విమర్శించారు. పర్సెంటేజీ ఇస్తేనే పనిచేస్తున్నారని కొంత మంది ప్రభుత్వంలోని వారే ఆరోపిస్తున్నారని అన్నారు. కవిత సోమవారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించారు. దంతాలపల్లి మండలం రామానుజపురంలో తన సహకారంతో బీఆర్ఎస్ కార్యకర్త చిర్ర సతీశ్ ఏర్పాటు చేసిన ఇంటర్నెట్-జిరాక్స్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. అంతకుముందు ముందు మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్‌లో ఎస్ఎల్బీసీ సొరంగం కూలిపోతే దాన్ని సందర్శించే సోయిలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని మండిపడ్డారు. ప్రజలకు ఏం చేశారని రేవంత్‌రెడ్డి ప్రచారంలో చెప్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, రాజకీయం తప్ప పరిపాలనపై దృష్టి లేదని ఆరోపించారు. పండించిన పంటకు ధర లేక మిర్చి రైతులు కన్నీరు పెట్టే పరిస్థితి ఏర్పండిందని, రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని విమర్శించారు. మిర్చి క్వింటాకు రూ.25 వేల చొప్పున మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రచార(పీఆర్) స్టంట్ల మీద ఉన్న సోయి ప్రజల కోసం పనిచేయడంలో లేదని అన్నారు. కేసీఆర్ హయాంలో మహబూబాబాద్ జిల్లా వేగంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. ఆకేరు వాగు పొంగి వరదలు వచ్చినప్పుడు నష్టపోయిన వారికి ప్రభుత్వం ప్రకటించిన సాయం ఇప్పటికీ అందలేదని చెప్పారు. వరద లొచ్చినా, కన్నీళ్లిచ్చినా, కష్టాలొచ్చినా ప్రజలకు అండగా ఉండేది గులాబీ జెండా(బీఆర్ఎస్) ఒక్కటేనని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయవద్దని విజ్ఞప్తి చేశారు.

మార్కెట్ సందర్శన

కేసముద్రంలోని మిర్చి యార్డులను ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. మిర్చి రైతుల కష్టాలు, ఇబ్బందులు, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. గిట్టుబాటు ధరలు రావడంలేదని, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని రైతులు తమ గోడును చెప్పుకున్నారు. 'ముఖ్యమంత్రి ఢిల్లీ పోతారో, ప్రధాని మోదీ కాళ్లు పట్టుకుంటారా... ఏం చేస్తారో మాకు సంబంధం లేదు. మిర్చికి క్వింటాకు కచ్చితంగా రూ.25 వేల మద్దతు ధర సాధించాల్సిందే' అని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మిర్చి ధరలు తగ్గితే ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి లొల్లిలొల్లి చేశారని, ఇక్కడ మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్క మాట మాట్లాడటం లేదని విమర్శించారు. నిరుడు క్వింటాలు మిర్చి ధర రూ.25 వేలు ఉండగా, ఇప్పుడు రూ.11 వేలకు పడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. మహబూబాబాద్-కేసముద్రం ప్రాంతానికి చెందిన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఎప్పుడూ సీఎం రేవంత్‌రెడ్డి చుట్టే ఉంటారని, మిర్చి రైతుల కష్టాలు సీఎంకు చెప్పడానికి ఆయనకు ఒక్క నిమిషం దొరకడం లేదా అని ప్రశ్నించారు. కవితతో పాటు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు ఆయువుపట్టు

- కేసీఆర్ వీరాభిమాని సతీశ్‌కు చేయూతనివ్వడం నా బాధ్యత
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కార్యకర్తలే బీఆర్ఎస్‌కు ఆయువుపట్టు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. పార్టీని నమ్ముకున్న నాయకులు, వారి కుటుంబాలకు అండగా ఉండటం కేసీఆర్ మనకు నేర్పిన బాధ్యత అని సోమవారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కేసీఆర్ చూపిన బాటలో ఆయన వీరాభిమాని చిర్రా సతీశ్‌కు ఉపాధి కల్పించేందుకు చేయూతనందించానని పేర్కొన్నారు. సతీశ్ స్వగ్రామం మహబూబాబాద్ జిల్లాలోని రామానుజపురంలో 'కేసీఆర్ ఇంటర్నెట్-జిరాక్స్' సెంటర్‌ను ప్రారంభించే అవకాశం తనకు దక్కడం ఎంతో సంతోషకరమని తెలిపారు.

లోకం పోకడ

నీళ్లు లేవు అని అడిగితే సోడా కలుపుకొమ్మంటారేం సార్? మేం అడిగేది సాగునీరు!

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గం శివ మల్లన్న ఆలయ సమీపంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

ప్రజల ప్రాణాలంటే కాంగ్రెస్‌కు పట్టింపు లేదా ?

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారి కుటుంబసభ్యులతో రాస్తారోకో

కాగజ్ నగర్, ఫిబ్రవరి 24 : కాంగ్రెస్‌కు ప్రజల ప్రాణాలంటే పట్టింపులేదని, వారికి ప్రజల సంక్షేమం కంటే ఎమ్మెల్సీ ఎన్నికలే ముఖ్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవాచేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గం శివమల్లన్న ఆలయం సమీపంలోని ఇరుకు వంతెన వద్ద సోమవారం రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన పిల్లల కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరుకైన వంతెనతో నెలకు రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎమ్మెల్సీ, అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. అందవెల్లి బ్రిడ్జి, సిర్పూర్ రెల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయని, ఇరుకు వంతెనల సమస్య పరిష్కరించలేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో 8 మంది ప్రమాదంలో ఉంటే ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అమెరికాలో ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు.

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత సయ్యద్ అక్బర్ హుస్సేన్, చిత్రంలో మైనార్టీ నేత వహీద్ అహ్మద్ తదితరులు

మైనార్టీల సంక్షేమంలో రేవంత్‌రెడ్డి విఫలం

- రంజాన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ సమీక్షించకపోవడం దారుణం
- కేసీఆర్ పాలనలో మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలు
- బీఆర్ఎస్ మైనార్టీ నేత సయ్యద్ అక్బర్ హుస్సేన్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): మైనార్టీల సంక్షేమంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ మైనార్టీ నేత సయ్యద్ అక్బర్ హుస్సేన్ దుయ్యబట్టారు. సోమవారం తెలంగాణభవన్‌లో మైనార్టీ నేత వహీద్ అహ్మద్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు మైనార్టీ మంత్రి లేడని, రంజాన్ మాసం ప్రారంభం కావస్తున్నా.. ఇంతవరకు సీఎం సమీక్ష నిర్వహించకపోవడం దారుణమని విమర్శించారు. కేసీఆర్ హయాంలో మైనార్టీల జీవితాల్లో వెలుగులు నింపితే, కాంగ్రెస్ పాలనలో చీకట్లు కమ్ముకున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో మైనార్టీలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యేవని, ఇప్పుడు షాదీ ముబారక్ చెక్కులు కూడా అందడం లేదని పేర్కొన్నారు. రంజాన్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించలేదని, శాంతిభద్రతల పరిరక్షణలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వహీద్ అహ్మద్ మాట్లాడుతూ.. సుమారు 15 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీల సంక్షేమానికి ఒక్క కార్యక్రమం చేపట్టలేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు రేవంత్‌రెడ్డి శాయశక్తులా కృషి చేస్తున్నాడని ఆరోపించారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలపై సీఎం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇఫ్తార్ విందులను ముస్లింలు బహిష్కరించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముస్లిం ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు.

విద్యుత్తు ప్రైవేటీకరణపై దేశవ్యాప్త సమ్మె

- జూన్ 26న నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఈఏ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 26న దేశవ్యాప్త సమ్మెకు దిగనున్నట్టు తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) ప్రకటించింది. మార్చిలో దేశవ్యాప్తంగా సమ్మె సన్నాహక సమావేశాలను నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు పీ రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీ సదానందం తెలిపారు. నేషనల్ కో ఆర్డినేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అండ్ ఎంప్లాయిస్(ఎన్సీసీవోఈఈఈ) నిర్ణయం మేరకు తెలంగాణలోనూ సమ్మెకు దిగుతామని ప్రకటించారు.

సాగునీరు ఇవ్వాలని రైతుల ధర్నా

వారబందీ విధానం లేకుండా చివరి ఆయకట్టు భూములకు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని వైరా-జగ్గయ్యపేట రోడ్డుపై సోమవారం ధర్నా నిర్వహించారు. వారబందీ విధానం వల్ల చివరి ఆయకట్టులో సాగు చేసిన మక్కజొన్న పంటలకు నీరందడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. - బోనకల్లు

హైదరాబాద్‌లోని నీరాకేఫ్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘాల నాయకులు

నీరాకేఫ్‌ను యథావిధిగా కొనసాగించాలి

- లేకుంటే కాంగ్రెస్‌ను బొందపెడ్తం
- కొత్త కేఫ్‌లు తెస్తారనుకుంటే.. ఇప్పటికే ఉన్న నీరా కేఫ్‌లు తీసేస్తరా?
- గౌడన్నలంతా ఐక్యంగా ఉద్యమించాలే
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘాల ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం టూరిజం పేరుతో నీరా చరిత్రను చెరిపివేయాలని దుర్మార్గపు ఆలోచన చేస్తున్నదని, అలా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. నీరాకేఫ్‌ను యథావిధిగా కొనసాగించాలని, లేకుంటే రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని బొందపెట్టేందుకు వెనకాడబోమని తెలిపారు. సోమవారం నెక్లెస్‌రోడ్‌లోని నీరా కేఫ్ వద్ద జాతీయ, రాష్ట్ర స్థాయి గౌడ సంఘాల నేతలతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ ప్లకార్డులు చేతబూని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా కొత్త పనులు చేపట్టి ఉన్నదాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దుతారు. కానీ, ఉన్నది తీసేస్తారా? అని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ దుర్మార్గులు, చరిత్రహీనులు చేసే పనిగా పేర్కొన్నారు. 'ఎంత ధైర్యం ఉంటే ఇలా చేస్తారు? బిడ్డా మేము ఊదితే.. మీరంతా కొట్టుకుపోతారు.. కేసీఆర్ తెచ్చిన నీరా చరిత్రను తుడిపేసే కుట్ర చేస్తున్నారా? ఖబర్దార్' అంటూ హెచ్చరించారు. గీత కార్మికులు చెట్లు ఎక్కే ప్రతిమలను తీసేసి ట్యాంక్‌బండ్‌లో పడేస్తారా? ఎందుకంత అహంకారం? అని మండిపడ్డారు. నీరా కేఫ్‌ను ముట్టుకుంటే ఊరుకునేది లేదని, అన్ని గౌడ సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గౌడన్నలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని, ఇప్పటికే వందల మంది గౌడన్నలను జైళ్లలో పెట్టే పరిస్థితులు వచ్చాయని ఆరోపించారు. కేసీఆర్ ముందుచూపుతో దేశంలో ఎక్కడాలేని విధంగా నీరా కేఫ్ తీసుకొచ్చారని, దాంతో గౌడన్నలు కాలర్ ఎగరేసుకొని బతికినట్టు గుర్తుచేశారు. కేసీఆర్ ప్రోత్సాహంతో నీరా కేఫ్‌ను నిర్మించుకున్నాం. దాని జోలికి వస్తే ఊరుకునేది లేదు అని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. మా ఆత్మగౌరవన్ని దెబ్బతీస్తున్నారు, నార్కోటిక్ డ్రగ్స్ పేరుతో గౌడన్నలను వేధిస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

టూరిజం శాఖకు అధికారం లేదు..

నీరా కేఫ్‌లో టూరిజం శాఖకు ఎలాంటి అధికారం లేదని, మొత్తం బీసీ సంక్షేమశాఖ డబ్బులని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 'నాటి ప్రభుత్వం కార్పొరేషన్ నుంచి కట్టిన బిల్డింగ్ ఇది. ల్యాండ్ మాత్రమే టూరిజం శాఖది. మెయింటనెన్స్ కోసమే వారికి ఇచ్చాం. దీనిని టాడి టాపర్స్ కార్పొరేషన్‌కు అడిగితే.. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వెంటనే జీవో ఇచ్చారు. మా చరిత్రను తుడిపేసే ప్రయత్నం చేస్తే.. సర్వాయి పాపన్న వారసులమంతా ప్రాణాలకు తెగించి కొట్లాడుతం' అని ధ్వజమెత్తారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, గౌడ, కల్లుగీత సంఘాల నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య, అంబాల నారాయణగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అయిలి వెంకన్న, సాయిలుగౌడ్, నాగభూషణంగౌడ్, గౌడ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీకాంత్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్, బండి సాయన్న, ప్రభాకర్‌గౌడ్, రామ్మోహన్‌గౌడ్, మానసగౌడ్, రమేశ్‌గౌడ్, మోహన్‌సింగ్ అహ్లూవాలియా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

వర్గీకరణలో శాస్త్రీయత లేదు!

- గ్రూపుల్లో కులాల చేర్పులకు ప్రాతిపదిక ఏమిటి?
- 'లక్ష డప్పులు' పిలుపుతోనే ఆమోదం తెలిపారు
- ఎమ్మార్పీఎస్, సంఘాల సభలో మందకృష్ణ మాదిగ

బొల్లారం, ఫిబ్రవరి 24: రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ వర్గీకరణలో శాస్త్రీయత, హేతుబద్ధత పూర్తిగా లోపించాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. ఫలితంగా అన్ని కులాల్లో అసంతృప్తి నెలకొందని మండిపడ్డారు. సోమవారం సికింద్రాబాద్ డ్రీమ్ ల్యాండ్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 'లక్ష డప్పులు-వేయి గొంతులు' పిలుపుతోనే వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదించిందని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణకు మాలలు మినహా 58 కులాలు సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. మాదిగల జనాభాను పరిగణనలోకి తీసుకున్నా.. వెనుకబాటుతనం ఆధారంగా తీసుకున్నా 12% రిజర్వేషన్లు రావాలని స్పష్టం చేశారు. తప్పులు, లోపాలను సవరించి, ప్రభుత్వం అందరికీ న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్‌చేశారు.

వెనక్కి తగ్గం.. పోరాటం ఆపం

- ప్యారానగర్‌లో డంపుయార్డుపై నిరసన
- కొనసాగుతున్న ఆందోళనలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 24: ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును ప్రభుత్వం విరమించుకునే వరకు పోరాటాం ఆపమని జేఏసీ నాయకులు తేల్చిచెప్పారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు పనులు ఆపాలంటూ గుమ్మడిదలలో రైతు, మహిళా జేఏసీ నాయకులు, అఖిలపక్ష నాయకులు కలిసి సోమవారం జాతీయరహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి నాయబ్ తహసీల్దార్ కరుణాకర్‌రావుకు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డికి, మున్సిపల్ కమిషనర్ రఘుకు గులాబీపూలు అందజేసి డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని విన్నవించారు. 20 రోజులుగా ఆందోళనలు చేస్తున్న అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోక పోవడంపై ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మిడిదలలో 20వ రోజు పద్మశాలీ సంఘం సభ్యులు దీక్ష చేపట్టారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 20వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఎలాంటి గొడవలు చేసినా తక్షణమే వారిని చెదరగొట్టడానికి భాష్పవాయువు ప్రయోగించడానికి దీక్ష శిబిరం వద్ద 207 వజ్రాగ్యాస్ వాహనాన్ని పోలీసులు సిద్ధంగా ఉంచారు. దీంతో జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం, అధికార యంత్రాంగం కాలుదువ్వడానికి యత్నించడం తగదని పేర్కొన్నారు. వెంటనే భాష్పవాయువు వాహనాన్ని, పోలీస్ చెక్‌పోస్టులను తొలిగించాలని డిమాండ్ చేశారు.

గుమ్మడిదల తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు గులాబీపూలు ఇచ్చి డంపుయార్డు రద్దుచేయాలని విన్నవిస్తున్న జేఏసీ నాయకులు